ప్రచురణార్థం/ ప్రసారార్థం :

## మేడే శుభాకాంక్షలు కూడా చెప్పలేని మోడీని సాగనంపాలి
## పతాకావిష్కరణలో సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు
## అదానీ, అంబానీ కోసం కార్మిక హక్కుల హననం
## బిజెపిని ఓడించే వారికి సహకరిస్తాం
## 3న స్టీలు ప్లాంటు ఆందోళనకు మద్దతు

ప్రపంచ కార్మికవర్గ దీక్షాదినమైన మేడే శుభాకాంక్షలు చెప్పలేని మోడీ ప్రభుత్వాన్ని కార్మికులు, శ్రామికులు కుల,మతాలకు అతీతంగా పోరాడి సాగనంపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మికవర్గ దీక్షాదినం మేడే సందర్భంగా సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద శ్రీనివాసరావు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్‌కీ బాత్ 100 ఎపిసోడ్‌లో మాట్లాడిన ప్రధాని మోడీకి మేడే శుభాకాంక్షలు చెప్పాలనే స్పృహ కూడా లేదని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే మేడేని పక్కనబెట్టారని తెలిపారు. శ్రమను గౌరవిస్తామని ప్రచారం చేసుకుంటున్న పాలకులకు కార్మికులు, శ్రామికులకు హక్కుల ఉన్నాయనే విషయాన్ని గుర్తించకుండా చేస్తున్నారని అన్నారు. అదానీ, అంబానీల హక్కుల తప్ప మోడీకి మరొకటి పట్టడం లేదని విమర్శించారు. అటువంటి వ్యక్తికి గద్దెమీద కూర్చునే హక్కు లేదని అన్నారు. దేశంలో కార్మికులు ఆందోళనలు చేయకుండా కుల,మత విభేధాలు సృష్టిస్తున్నారని తెలిపారు.

మోడీ ప్రభుత్వం కార్మికులు రోజుకు 12 గంటలు పనిచేయాలనే విధంగా చట్టాలను సవరించి దుర్మార్గ చర్యలకు దిగుతోందని పేర్కొన్నారు. సంపద సృష్టించే కార్మికులు, తిండిపెట్టే శ్రామికుల గురించి ప్రస్తావించకుండా మన్‌కీబాత్‌లో సోది మాట్లాడితే దేశానికి ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. ఎవరిని ఉద్దేశించి మన్‌కీబాత్ మాట్లాడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. తమపై బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ లైంగికదాడికి పాల్పడుతున్నాడని మహిళా రెజ్లర్లు ఢిల్లీ వీధుల్లో ఎనిమిది రోజులుగా ఆందోళన చేస్తుంటే దాన్ని ప్రస్తావించడానికి మోడీకి నోరు రాలేదని తెలిపారు. దేశానికి పథకాలు తెచ్చిన సమయంలో వారిని పొగిడారని, న్యాయం చేయాలని అడుగుతుంటే స్పందించని కీచకులు పాలనలో ఉన్నారని తెలిపారు. నిండుసభలో ద్రౌపది వస్త్రాపహరణం జరిగిన సమయంలో అన్నా అంటే కృష్ణుడు వచ్చి దుస్తులు అందించాడని చెబుతారని, అటువంటి పురాణాల మీద గౌరవం ఉందని చెప్పే మోడీ రెజ్లర్ల బాధలపై కనీస ప్రస్తావన చేయకపోవడం అన్యాయమని అన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన కీచకుడి లాంటి ఎంపిని పక్కన కూర్చోబెట్టుకుని కీచక పాలన సాగిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీని సాగనంపితేనే దేశానికి రక్షణ అన్నారు. వారానికి 35 గంటలు మాత్రమే పనిచేయాలన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచనలను చెత్తబుట్టలో వేశారని పేర్కొన్నారు. శ్రమను పిండుకుని అదానీ, అంబానీలకు కట్టబెట్టేటువంటి మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి మేడే స్ఫూర్తి ఇస్తుందని అన్నారు.

యాపిల్ కంపెనీ 12 గంటల పనివిధానం కావాలంటే తమిళనాడు ప్రభుత్వం తొలుత అంగీకరించిందని, అక్కడి కార్మికులు తిరగబడితే ప్రజాభిప్రాయాన్ని గౌరవించి చట్టాన్ని రద్దు చేశారని తెలిపారు. మరోవైపు ఎపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టే విధంగా చట్టాలు చేస్తూ అనేక నిర్ణయాలు చేస్తోందని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో మోడీ విధానాలను జగన్ వేగంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. స్వేచ్ఛగా జరుపుకునే పండుగల్లోనూ భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. చివరకు ముస్లిములకు వస్తువులు అమ్మకూడదని చత్తీస్‌ఘర్ లాంటి రాష్ట్రంలో నిర్ణయం చేశారంటే బిజెపి ఎంత దుర్మార్గపు చర్యలకు దిగుతుందో అర్థమవుతుందని అన్నారు. ఇటువంటి వాటిని ఐక్యంగా తిప్పి కొట్టాలని కోరారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధ పద్దతులను ఖండించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కార్మికవర్గం ముందున్న కర్తవ్యమని అన్నారు. జగన్ కార్మిక వర్గ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు నడుం కట్టాలని తెలిపారు.

### బిజెపిని ఓడించే వారికి సహకారం

రాష్ట్రంలో బిజెపిని ఓడించేవారికి సిపిఎం సహకారం ఇస్తుందని, వారికి లొంగిపోతే ఓడిస్తామని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జనసేన, టిడిపి, వైసిపిలు ఎవరెవరితో కలుస్తారో వారికే స్పష్టత లేదని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఎవరు నిలబడతారు. మాట్లాడతారు అనేది ముందు తేలాలన్నారు.

### 3న విశాఖ స్టీలుప్లాంటు ఆందోళనకు మద్దతు

విశాఖ స్టీలు ప్లాంటును కాపాడుకునేందుకు 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న రాస్తారోకోలు, ఆందోళనకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని శ్రీనివాసరావు తెలిపారు. ఆరోజు జరిగే ఆందోళనల్లో పార్టీ శ్రేణులు పాల్గొంటాయని ప్రకటించారు. రాష్ట్ర ప్రజలు కూడా స్వచ్ఛందగా ఈ కార్యక్రమంలో పాల్గొని బిజెపి, దానికి మద్దతు ఇస్తున్న వారికి బుద్దిచెప్పి, స్టీలు ప్లాంటును కాపాడుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం, ఆంధ్ర మల్యాద్రి, ఎం.సూర్యారావు, బి.ఆర్.తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

= = = =